ఎమ్మెల్యే మాగంటి ఆదేశాలతో రోడ్లకు మరమ్మతులు

ఎర్రగడ్డ: బోరబండ డివిజన్ వినాయకరావునగర్‌లో ఉన్న అంతర్గత రోడ్లు పలు చోట్ల దెబ్బతిన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై డివిజన్ బీఆర్ఎస్ నేతలు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి పరిస్థితి గురించి వివరించారు. స్పందించిన ఆయన.. సంబంధిత అధికారిని సమస్య పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు శనివారం రంగంలోకి దిగిన సిబ్బంది.. వినాయకరావునగర్ బస్తీలోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేశారు.

అభివృద్ధి పనుల్లో లోపాలు ఉండొద్దు

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ/శంషాబాద్ రూరల్: కోట్లాది రూపాయలను వెచ్చించి నార్సింగి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 4,5,6,7వ వార్డుల్లో కమ్యూనిటీహాల్స్, మోడ్రన్ టాయిలెట్స్, సీసీ రోడ్డు, డ్రైనేజీ అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, చైర్పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్, నార్సింగి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ కోట వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్ మున్సిపాలిటీలోని 17వ వార్డులో నిర్మించిన స్కేటింగ్ గ్రౌండ్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్, కమిషనర్ సుమన్‌రావు, మాజీ సర్పంచ్ గణేష్ గుప్త, కౌన్సిలర్ మేకల వెంకటేశ్, గూడల వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

ముమ్మరంగా సర్వే

జూబ్లీహిల్స్:యూసుఫ్‌గూడ సర్కిల్‌లో రేషన్ కార్డుల సర్వే ముమ్మరంగా చేపడుతున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి తుది విడత వివరాలు సేకరిస్తున్నారు. శనివారం వెంకటగిరిలో సిబ్బంది చేపడుతున్న సర్వేను 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, యూసీడీ డీపీఓ వెంకట కిషన్‌రావుతో కలిసి పరిశీలించారు.

అప్పుడే పెరిగిన ట్యాంకర్ల బుకింగ్

జూబ్లీహిల్స్, జనవరి18: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు జలమండలి అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఆటంకం కలుగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు వేసవిలో పెరగనున్న డిమాండ్‌ను అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. జనవరి లోనే ట్యాంకర్ల బుకింగ్‌తో పాటు నీటి వినియోగం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మార్చి నాటికి విపరీతంగా పెరుగనున్న డిమాండ్‌ను తట్టుకునేలా నీటి వనరులను పెంపొందించుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జలమండలి ఎండీ ఆదేశాలతో ఫిబ్రవరి నాటికి వేసవిలో పెరుగనున్న డిమాండ్‌కు తగ్గ సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సరఫరాకు ఆటంకం కలుగకుండా రిజర్వాయర్‌లలో స్టాండ్‌బై మోటర్లు, ఫిల్లింగ్ స్టేషన్‌లతో పాటు ఫిల్లింగ్ పాయింట్‌లు, ట్యాంకర్లు సిద్ధం చేసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. జలమండలి డివిజన్-6 పరిధిలోని ఆయా సెక్షన్‌లలో 23 రిజర్వాయర్లు, 11 ఫిల్లింగ్ స్టేషన్లు, 32 ఫిల్లింగ్ పాయింట్లు, 170 ట్యాంకర్లు నిరాటంకంగా నీటి సరఫరా చేస్తున్నాయి. కాగా, ఈ ఏడాది డిమాండ్‌కు తగ్గ సరఫరా చేసేందుకు వీటికి అదనంగా చేయాల్సిన ఏర్పాట్లకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇటీవల జలమండలి ఎండీ అశోక్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించి వేసవిలో వినియోగదారులకు అవసరమైన మేరకు నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు
సమ్మర్ యాక్షన్ ప్లాన్‌కు రంగం సిద్ధం
అదనంగా 50 ట్యాంకర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

సమ్మర్ యాక్షన్ ప్లాన్..

జలమండలి ఆధ్వర్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుచేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్ అన్ని సెక్షన్‌ల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలోని జూబ్లీహిల్స్ సెక్షన్ రిజర్వాయర్‌తో పాటు ఎస్‌పీఆర్ హిల్స్‌లో 2, ఎల్లారెడ్డిగూడ, ఎర్రగడ్డ తదితర సెక్షన్‌లలో ఉన్న ఒక్కో రిజర్వాయర్‌లకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ -19 సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో వేసవిలో ప్రజలకు నీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

వాటర్ రిజర్వాయర్ల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జలమండలి జీఎం హరిశంకర్

వేసవిని దృష్టిలో పెట్టుకొని..

వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరాలో ఆటంకం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. జలమండలి ఎండీ ఆదేశాల మేరకు అదనంగా ఫిల్లింగ్ పాయింట్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ట్యాంకర్లు పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రిజర్వాయర్లతో పాటు పంపింగ్ పనితీరును, అదనపు యంత్రాలను సిద్ధంగా ఉంచుకుంటున్నాం. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇప్పటికే ఉన్న 170 ట్యాంకర్లకు అదనంగా మరో 50 ట్యాంకర్లతో ఈ వేసవిలో ప్రజలకు అవసరమైన మేరకు తాగునీటిని సరఫరా చేస్తాం.

- ఎస్. హరిశంకర్, జీఎం, డివిజన్-6, జలమండలి

నేడు క్యాన్సర్‌పై అవగాహన శిబిరం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 18: కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన శిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు సర్జికల్ ఆంకాలజీ విభాగం డాక్టర్ మధుదేవరశెట్టి తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని మార్కండేయ భవన్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరవుతారన్నారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్, లంగ్ క్యాన్సర్, లివర్ క్యాన్సర్, కొలరెక్టల్ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్ తదితర వాటిపై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలాన్లు తప్పించుకునేందుకు..

బంజారాహిల్స్: ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు కారుకు తప్పుడు నంబర్‌ప్లేట్‌ను అమర్చిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. రోడ్ నం. 7లో ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లను తొలగించేందుకు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డు పక్కన పార్క్ చేసిన కారును పక్కకు తొలగించడంతో పాటు చలానా విధించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో కారు నంబర్‌ను పరిశీలించగా ఏపీ 02బీఆర్0378 అని కనిపించింది. అనుమానం వచ్చి ఇంజిన్ నంబర్ పరిశీలించగా నంబర్ ప్లేట్‌లో ఉన్న నంబర్ తప్పు అని గుర్తించారు. కారు అసలు నంబర్ టీఎస్ 09ఎఫ్ఈ 7766 అని కారు యజమాని శ్వేతారెడ్డి దేవిరెడ్డి అని తేలింది. ఈ కారును తాను 3 నెలల నుంచి వాడుతున్నానని, తనకు హర్ష అనే వ్యక్తి కారు ఇచ్చాడంటూ సయ్యద్ సలీమ్ (38) అనే వ్యక్తి చెప్పాడు. ట్రాఫిక్ చలానాలు తప్పించుకునేందుకు వేరే నంబర్ పెట్టుకుని తిరుగుతున్నారని గుర్తించారు. కారుపై ఉన్న నంబర్ అనంతపురం ప్రాంతానికి చెందిన వాహనానిదని తేలింది. ఈ మేరకు నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా సలీం తదితరులపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి సర్వే చేపట్టాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. డివిజన్‌లోని అన్ని బస్తీల్లో సర్వే సమగ్రంగా చేపట్టాలని అధికారులను కోరారు.
-జూబ్లీహిల్స్, జనవరి18

నకిలీ సర్ఫ్ స్వాధీనం

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 18: నకిలీ సర్ఫ్‌ను తయారు చేస్తున్న కంపెనీపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. కాటేదాన్ పారిశ్రామిక వాడ ప్రాంతంలో నెలకొల్పిన కంపెనీలో నకిలీ సర్ఫ్‌ను తయారు చేస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులు కంపెనీపై దాడి చేసి సామగ్రి, ప్రముఖ బ్రాండ్లకు చెందిన నకిలీ సర్ఫ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ

జూబ్లీహిల్స్: తెలంగాణ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా స్టేట్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. క్షితిజ బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా 2024 నవంబర్ 2న బాధ్యతలు చేపట్టిన ఆమెకు తెలంగాణ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎస్సీ డీడీ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఆదేశాల మేరకు ఎస్సీ డీడీ కమిషనర్‌గా క్షితిజ బాధ్యతలు చేపట్టారు.

హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతంలో ప్రముఖ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ కొత్త షోరూమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు శనివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, షేక్‌పేట కార్పొరేటర్ మొహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లో తమ 15వ షోరూమ్ ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని, ఈ సందర్భంగా జనవరి 18 నుంచి జనవరి 31వరకు ప్రత్యేక వెండి ఆఫర్ ఇస్తున్నామని, ప్రతీ కొనుగోలుతో పాటు కస్టమర్లు బంగారంతో సమానమైన బరువున్న వెండి నాణేన్ని పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.

-సిటీబ్యూరో, జనవరి 18(నమస్తే తెలంగాణ)

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 18: చదువుతో పాటు క్రీడలు, వివిధ సంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో అవసరమని కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజిరెడ్డి అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వారి బంగారు భవిష్యత్‌కు సరైన ప్రణాళికను ఎంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఓఎస్ఏ కళాధర్ బాబు, ప్రశాంత్, అసోషియేట్ డీన్ డా. శ్రీనివాసన్, డీఆర్ లక్ష్మీ నారాయణ, ఐఎఫ్ఎస్ డీన్ ఆశ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఏఐ..వర్క్‌షాప్

వ్యవసాయ యూనివర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీ, పీఆర్ సమావేశ మందిరంలో శనివారం వ్యవసాయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ)పై వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా జాతీయ గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీ, పీఆర్) డైరెక్టర్ జనరల్ డా. నరేంద్రకుమార్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి , ఎం. రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ప్రారంభం

తెలుగు యూనివర్సిటీ, జనవరి 18: రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన ముదిరాజ్‌లను చైతన్యపరచడమే లక్ష్యంగా ముదిరాజు ప్రజా చైతన్య యాత్రను చేపట్టినట్లు జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్రకుమారస్వామి తెలిపారు. గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ముదిరాజు ప్రజా చైతన్య యాత్రను చేపట్టిన నాయకులు నెల్లి లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం బస్సు యాత్రను ప్రారంభించారు.

కులగణన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచుతాం



మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ: జనాభా గణనలో కులగణన చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి వేలాది మందితో జాతీయ స్థాయిలో ఉద్యమం చేయనున్నట్లు జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి హెచ్చరించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రధానిపై ఒత్తిడి తేవాలని, జనగణనలో కులగణన చేయాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. బీసీల మనో భవాలను గ్రహించి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణన తీర్మాణం చేసి కేంద్రానికి పంపించి తన నిజాయితీని నిరుపించుకున్నారని గుర్తుచేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 ఏండ్లు దాటినా బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయమే జరుగుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల బీసీ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్స్ డ్రెయిన్ పనులు వేగవంతం చేయండి

-మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌లో పర్యటిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ కవితారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.10లోని తెలంగాణ భవన్ నుంచి బంజారా లేక్ దాకా చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. రూ.30కోట్ల అంచనా వ్యయంతో 2.5 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న బాక్స్ డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ నాలా పనులతో పాటు తాగు నీటి లైన్ పనులు కూడా చేపట్టాలని, డ్రెయిన్ లైన్ పూర్తయిన తర్వాత వేరే పనుల కోసం తవ్వకాలు జరగకుండా ముందుగానే పనులు పూర్తిచేసుకోవాలని ఆదేశించారు. బాక్స్ డ్రెయిన్ కోసం పేదల ఇండ్లకు ఎలాంటి నష్టం ఉండదని స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. అనంతరం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట ప్రతాప్‌నగర్‌లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ కోసం స్థలాన్ని పరిశీలించారు. బస్తీలో సీసీ రోడ్లను వేయాలని స్థానికులు కోరారు.

కాలు తగిలిందన్న కోపంతో..

బంజారాహిల్స్:పబ్‌లో డ్యాన్స్ చేస్తున్న సమయంలో కాలు తగిలిందన్న కోపంతో యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుత్బుల్లాపూర్ సమీపంలోని వాణినగర్‌లో నివాసం ఉంటున్న ప్రైవేటు ఉద్యోగి బాలకృష్ణ తన కొలీగ్స్‌తో కలిసి ఈనెల 11న రాత్రి జూబ్లీహిల్స్‌లోని క్లబ్ రోగ్ పబ్‌కు వచ్చాడు. పబ్‌లో మ్యూజిక్‌కు అనుగుణంగా డ్యాన్స్ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తికి కాలు తగిలింది. పొరపాటున తన కాలు తగిలిందని ఆ వ్యక్తికి క్షమాపణ చెబుతున్నా వినిపించుకోకుండా గొడవకు దిగడంతో పాటు బాలకృష్ణ మీద దాడికి దిగారు. నలుగురైదుగురు వ్యక్తులు పిడిగుద్దులతో విరుచుకుపడడంతో తీవ్రంగా గాయపడిన బాలకృష్ణ 108 అంబులెన్స్‌ను పిలిపించుకుని ఆస్పత్రిలో చేరాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం శనివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాలకృష్ణ తనమీద దాడికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాల్సిందే

హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్: తెలుగు జాతి గౌరవాన్ని చాటిచెప్పిన మహనీయుడు దివంగత ఎన్‌టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాల్సిందే అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఫిలింనగర్‌లోని ఆయన విగ్రహానికి ఎన్‌టీఆర్ కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఎన్‌టీఆర్ కీలకపాత్ర పోషించారన్నారు. ట్యాంక్‌బండ్‌లో మహనీయుల విగ్రహాల ఏర్పాటు, బుద్ధ విగ్రహం, నెక్లెస్‌రోడ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఎన్‌టీఆర్ దూరదృష్టితో చేపట్టారన్నారు. ఎన్‌టీఆర్‌కు భారతరత్న దక్కేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఆర్ తనయుడు మోహనకృష్ణ, మనవరాలు నందమూరి రూప, సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం10లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ నందమూరి బాలకృష్ణ

ఫిలింనగర్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, పరుచూరి గోపాలకృష్ణ తదితరులు